# సినిమా కథ

కథానాయిక పాడుతూ ఫేడిన్ అయి, క్లోజప్‌లో పాడుతూ మనకేసి చూసి నవ్వుతూ గదంతా డాన్స్‌చేస్తున్నది. "ఎంతహాయి! ఎంతహాయి!" అనే పల్లవిని బట్టి ఆమెకు హాయిగా వున్నట్టూ, అందుకే డాన్స్ చేస్తున్నట్టూ మనకు తెలుస్తున్నది.

ఇంతలో కాఫీపట్టుకొని కూతురు పాటకు లయగా అడుగులు వేస్తూ వచ్చి, పాటా బాజా భజంత్రీలు ఆగిపోయినదాకా నిలబడి కూతురుకు కాఫీ అందిస్తూ "ఎటువంటివాడు రావలసివున్నాడో!" అన్నది తల్లి.

కథానాయిక ప్రణయకోపం మొహంపెట్టి "పోమ్మా!" అన్నది.

"ఏమే? మంచి డాక్టరు మొగుడై ఇద్దరూ ప్రాక్టీసు పెడితే ఎంత బాగుంటుంది?" అన్నది తల్లి.

కూతురు నోటినుంచి కాఫీకప్పు దించి – లిప్‌స్టిక్ పెదవులకు కాఫీ తడిలేదు.

"నువ్వెప్పుడూ ఇట్లాగే అంటావు!" అని దెప్పింది, మొహం చిట్లించి మూతితో మాత్రమే నవ్వుతూ.

మన కథానాయికకు తండ్రిలేదుగాని ఆయన పటం గోడన వేలాడుతున్నది – ఇంత బూజుగాని, దుమ్ముగాని లేకుండా దానికి ఒక దండకూడా వేసివుంది.

తల్లి యేడుపుగొంతు పెట్టి ఆ ఫొటో దగ్గరకు వెళ్ళి "ఆయన వుంటే మనకిన్ని యిబ్బందులు రాకపోనుగద!" అన్నది.

కూతురు "హాయి హాయి" పాట మర్చిపోయిన దానల్లే నిట్టూర్చింది.

ఈ తల్లీ కూతుళ్ళు పడే కష్టాలు మనం తెలుసుకోవటం అవసరం. కూతురు ఫైనల్ ఇయర్ మెడిసిన్ చదువుతున్నది. నూటికి నూరేసి మార్కులు తెచ్చుకుంటున్నది. తల్లి అంట్లుతోమి కూతుర్ని చదివిస్తున్నట్టు నిదర్శనాలేమీ లేవు. అయినా వాళ్ళకు డబ్బులేదు, రాబడిలేదు. అందుకని తల్లి జార్జెట్ చీరలు కడుతున్నది. కూతురు సాదా నైలాన్ దుస్తులు మాత్రమే ధరిస్తున్నది. డబ్బుంటే యింకా యెంత పెద్దయింట్లో వుండి, ఎంత బాగా బతికేవాళ్ళో పాపం.

అయితే కథానాయిక గనక, మెడికల్ కాలేజీలో సహాధ్యాయినులందరూ చెలికత్తెల్లాగా

వుండి కణ్వాశ్రమంలో శకుంతలకు అనసూయా ప్రియంవద లెలావుండేవారో అలా వుండి, ఆమె ఆకలే తమ ఆకలిగా, ఆమె ప్రణయమే తమ ప్రణయంగా, పరమాదర్శంగా ప్రవర్తిస్తున్నారు.

ఇపుడు మనం హీరోను కలుసుకోవాలి. ఇతను కూడా మెడికల్ కాలేజీ స్టూడెంటే. నాయికా నాయకులిద్దరూ ఒకటే క్లాసు. వాళ్ళిద్దరికీ మధ్య ప్రేమబంధం వున్నదని క్లాసులో అందరికీ తెలుసు. మగ స్టూడెంట్లు దుష్యంతుడి వేడుక చెలికాళ్ళులాగా ప్రవర్తిస్తారు. వాళ్ళ క్లాసులో యింకా ఆడపిల్లలున్నా వాళ్ళను గురించి మగస్టూడెంట్లు పట్టించుకోరు.

హీరో ఎప్పుడూ ప్రపంచాన్ని వుద్ధరించే పనులే చేస్తుంటాడు కనకనూ, హీరోయిన్ "ఎంతహాయి!" పాడి చాలా సేపయింది కనుకనూ, అతను హీరోయిన్ దగ్గరికొచ్చి, "బిచ్చగాళ్ళకోసం ఒకనాటకం వేద్దామనుకొంటున్నాము. అందులో మీరు భరతమాత వేషం వేసి డాన్స్ చేయాలి!" అంటాడు.

"మీరడిగితే ఏదైనా చేస్తాను" అంటుంది కథానాయిక. ఆమె అతన్ని ప్రేమిస్తున్నట్లు స్పష్టం కాగలందులకు.

"హీరో ఆ మాటలను అర్థంచేసుకోకనో, చేసుకొనో, మీరలా అంటారని నాకు ముందే తెలుసు" అని, మొహం చిట్లిస్తాడు, తీవ్రమైన ఆలోచనలో వున్నట్టు.

అక్కడనుంచి పాట అందుకొని హీరోయిన్ వీథివెంట పాడుకుంటూ, మధ్య మధ్య భాగవతారల్లే అడుగేస్తూ వీథులవెంటా, ఒక చేనుపక్కగా, ఒక మోట బావిచుట్టూ తిరిగి, ఒక కొండ ఎక్కిదిగి పాట భజంత్రీలు ఆగే సమయానికి యింటికి వచ్చేసింది.

ఆమె లోపలికి అడుగు పెడుతూండగానే ఆర్కెస్ట్రా కెవ్వున అరిచింది. ఎందుకంటే హీరోయిన్ ఇంటలేనప్పుడు ఆమె మేనమామ వచ్చివున్నాడు. అతన్ని చూడగానే హీరోయిన్ మొహం ముడుచుకుపోయింది. ఎందుకంటే యీ మేనమామ విలన్. అందుకనే హీరోయిన్ను చూచి నవ్వి "డాక్టర్ వచ్చిందే! ఇతర రోగాలు నయం చెయ్యటంకాదు, నా హృదయంలో జబ్బు నయం చేస్తేనే నువ్వు నిజమైన డాక్టర్ అని వొప్పుకొంటాను."

హీరోయిన్ ప్రణయకోపం మొహంపెట్టి అతనికి ఎడంగా తప్పుకొని లోపలికి పోతుంది. విలన్ ఎందుకో గట్టిగా నవ్వుతాడు.

హీరోయిన్ "అమ్మా, అమ్మా" అంటూ తల్లిదగ్గరికి వచ్చేముందే వ్యాసపీట మీద భాగవతంలాంటి పుస్తకం పెట్టుకొని కొద్దిపాటి ఆర్కెస్ట్రా సహాయంతో "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అనే పద్యం పన్నెండేళ్ళ పిల్లగొంతుతో మాల్కోస్ రాగంలో సంగతులు వేసి పాడుతున్నది. పద్యమూ భజంత్రీలు అయిపోగానే హీరోయిన్ లోపలికి వచ్చి "అమ్మా, అమ్మా" అన్నది.

తల్లి అంతలోనే గొంతుమార్చి, "మామయ్యొచ్చాడు తల్లీ" అన్నది.

"ఆ దుర్మార్గుణ్నెందుకు రానిచ్చావు మనింటికి?" అన్నది హీరోయిన్. పళ్ళు, కొంచెంగా కొరికి మొహం చిట్లించి ముక్కులెగరేస్తూ.

తన కూతురుకు విలనంటే కోపమని అర్థమై తల్లి ఆశ్చర్యంతో "అదేమిటే?" అన్నది.

"నీకు తెలీదులే అమ్మా" అన్నది కథానాయిక, విలన్‌చేత అనేకసార్లు బలాత్కరింపబడిన దానిలాగా.

"నిన్ను తనకిచ్చి పెళ్ళిచెయ్యమంటున్నాడు. బాగానే వుంటుంది కూడాను. ఐన సంబంధం. బోలెడంత సంపాదిస్తున్నాడు. ఫ్యాక్టరీకి మేనేజరయాట్ట. మూడొందలు జీతమిస్తారు. బీచిలో పెద్ద బంగళా, ముప్పై వేల ఖరీదు చేసే కారు కొన్నాట్ట. నూరు రూపాయలకు తక్కువ ఖరీదు చేసే ప్యాంటు వెయ్యడు. క్లబ్బు కెళ్ళి రోజుకి నూరు రూపాయల బుడ్డి సారా తాగుతాట్ట. నిన్ను పువ్వుల్లోపెట్టి పూజిస్తాడమ్మా. నాకీ మధ్య వంట్లో బాగోటం లేదు కూడాను" అంటూ తల్లి దగ్గటం మొదలెట్టింది.

అంతదాకా కళ్ళుమూసుకొని హీరోను జ్ఞాపకం చేసుకుంటున్న హీరోయిన్ కళ్ళు చాలా పెద్దవి చేసి ఆదుర్దాగా "ఏమిటమ్మా? ఏమిటమ్మా?" అంటూ తల్లిమీద అమ్మశక్తిలాగా పడింది.

ఆ బొమ్మలోంచి ఇంకో బొమ్మ వచ్చేటప్పటికి తల్లి మంచం మీద పడుకొని దగ్గుతున్నది. ముందు డాక్టరూ, అతని బ్యాగ్ పట్టుకొని హీరో వచ్చాడు. తల్లికి తల పిసుకుతున్న హీరోయిన్ లేచి "రండి, డాక్టర్!" (రండి డాక్టరుగారూ, అనటం పల్లెటూరు గమార్ల లక్షణం.) అంటూ హీరో చేతిలో బ్యాగ్ తీసుకొని రెడీగా ఉన్న స్టూలుమీద పెట్టింది.

హీరో ఆమెకేసి రేసుల్లో డబ్బు పోగొట్టుకున్నట్టు చూశాడు. "విన్నాను విన్నాను" అన్నట్టుగా తలపైకీ కిందికీ ఆడించింది.

డాక్టరు స్టెతస్కోపు తీసి రోగి గుండెలమీద పెట్టి పెద్ద నిట్టూర్పు విడిచి, మూలిగి "క్షయ! సీరియస్! బోత్‌లంగ్స్ ఎఫెక్టెడ్!" అన్నాడు.

త్వరలో తాను డాక్టరు కాబోతున్నది కనుక "నయమవుతుందా డాక్టర్" అని కొట్టవచ్చినట్టుగా అడిగింది.

డాక్టరు చప్పరించి "ఈ రీలు దాటదు" అనేశాడు.

హీరో వూరికే వుండటమెందుకని "శానిటోరియంకు పంపిస్తేను, డాక్టర్?" అన్నాడు.

డాక్టరు దీనంగా ఆలోచించి "అలా చెయ్యవచ్చు" అన్నాడు. అతను బరువుగా వెళ్ళిపోతుంటే భజంత్రీలు విషాదంగా వాయించారు.

పరీక్షలకు ముందు మెడికల్ విద్యార్థులందరూ వొకచోటికీ, విద్యార్థినులందరూ

ఇంకో చోటికీ పిక్నిక్ వెళ్ళారు. ఆడవాళ్ళ పిక్నిక్ బాగుంది. ఎవరూ ఏమీ అనకుండానే వాళ్ళు విరగబడి నవ్వుతున్నారు. దాన్ని బట్టి చాలా సంతోషంగా వున్నారని మనకు అర్థమవుతుంది.

అదృష్టవశాత్తూ ఒక మర్రిచెట్టుకు పెద్ద వుయ్యాల వేసి ఉంది. ఆ వుయ్యాలమీద ఎక్కి కథానాయిక "ఓలలలా! ఓహో లలలా!" అంటూ పాడుతున్నది. ఆమె సఖురాండ్రు సోల్పుగా నిలబడి కవాతు చేస్తున్నారు. డ్రిల్ సార్జెంటు వుండి చెప్పినట్టుగా వాళ్ళు స్టెతస్కోపులను వొకేసారి మెడకు వేసుకొని, వొకేసారి పైకెత్తి, వొకేసారి గుండ్రంగా తిప్పి, ఒకేసారి చెవులకు పెట్టుకొని, వొకేసారి తమ గుండెలు పరీక్ష చేసుకొని చాలా గమ్మత్తు చేస్తున్నారు. వేయేల? పరీక్షలకు ముందు లేడీ మెడికోలు పిక్నిక్ వెళ్ళి ఏమేం చేస్తే ఆదర్శప్రాయంగా ఉన్నట్టు పావలా క్లాసు వాళ్లకు తోస్తుందో అవన్నీ చేస్తున్నారు.

ఇంకో లొకేషన్లో మెడికల్ విద్యార్థులు అందరూ సైకిళ్ళెక్కి ఫార్మేషన్ రైడింగ్ చేస్తున్నారు. అన్నీ వొకేసారి కొన్న సైకిళ్ళు. సరికొత్తవి. హరిదాసు వెంట భక్తులు పాడినట్టుగా హీరో అన్న ప్రతిపంక్తిని అంటూ అందరూ కోరస్ పాడుతూ వస్తున్నారు. అదృష్టవశాత్తు రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

అక్కడ అమ్మాయిలు దాగుడుమూతలాడుతున్నారు. హీరోయిన్ కళ్ళకు గంతలు కట్టుకొని తన స్నేహితురాళ్ళను దొంగ చెయ్యటానికి చూస్తూ ఉంటుంది. అంతలో అక్కడికి హీరో ఒంటరిగా వస్తాడు. చెలికత్తెలంతా పారిపోయి చెట్లచాటున దాక్కుంటారు. హీరోయిన్ గాలిలో యీదుతూ వచ్చి హీరోను తాకి "ఆఁ దొరికావులే!" అంటుంది. (కవిగారు ఈ మాట పసందుగా వేశారు).

హీరోయిన్ గంతలు తీసిపారేసి, కళ్ళూ నోరూ పెద్దవి చేసి "మీరా?" అంటుంది. అనుమానం వుండటం మంచిదిగాదని, హీరో బరువుగా నిట్టూర్చి,

"అవును... నేనే!" అన్నాడు.

చెట్ల చాటునుంచి వెకిలిగా నవ్వులు వినిపిస్తాయి. హీరోయిన్ ప్రణయకోపం మొహం పెట్టి, "ఊరుకోండి! వాళ్ళంతా మనని ఏడిపిస్తారు!" అంటుంది.

"నేనేమీ చెయ్యలేదే!" అన్నట్టుగా హీరో తన చేతులను అటూ యిటూ తిప్పి చూసుకొంటాడు.

"రేపేకదూ మన ప్రదర్శనం?" అంటుంది హీరోయిన్ హీరో పక్కనే నడుస్తూ.

"అవును" హీరో నిట్టూరుస్తాడు.

కర్టెన్ పైకిలేస్తుంది. హీరోయిన్ భరతమాతగా ప్రేక్షకులకు కనిపిస్తుంది. "లేవండి! నడుములు–కట్టండి! దీక్షలు – పట్టండి! లంచాలు–" అంటూ పాడుతూ హీరో ప్రవేశిస్తాడు.

అనేక మంది ఆడవాళ్ళు అజంతా డ్రస్సులు వేసుకొని సాముగరిడీలు చేస్తారు. ఆ గరిడీలకు పాటకు ఏమీ సంబంధం వుండదు. కెమెరా ఒక ప్రక్కకి వొరిగిపోతుంది. తరువాత రెండో పక్కకి వొరిగిపోతుంది. ఆఖరికి చేసేదిలేక తల్లకిందులై పోతుంది. ప్రేక్షకుల్లో వొకాయన జేబులోనుంచి చిన్న పొట్లంతీసి బావన అల్లం ఇంత నోటవేసుకొని అమ్మాయిల అజంతా డ్రెస్సుకేసి శ్రద్ధగా చూస్తాడు...

ప్రదర్శనమైనాక అందరూ హీరోను, హీరోయిన్‌ను అభినందిస్తారు. హీరోయిన్ భరత మాతగా బాగా నిలబడినందుకూ, హీరో "పట్టండీ, కొట్టండీ, కట్టండీ" అన్న మాటలకు సరిగా చేతులు వూపినందుకూ. సాము గరిడీలుచేసి, వెనక్కు మొగ్గలువేసి వక్ష ప్రదర్శనాలు చేసిన అమ్మాయిలకు గ్రూప్ ఫొటోలో వాళ్ళ నొక్కరూ అభినందించరు.

(ఈ సినిమాలో మనం చూసే మొదటి గ్రూప్ ఫొటో ఈ ప్రదర్శనంలోనే).

హీరో ఆపరేషన్ థియేటరులో వున్నాడు. పెద్ద సర్జన్ ఆపరేషన్ చేస్తున్నాడు. హీరో హీరోయిన్ యిద్దరూ ఆయన పక్కన వుండి నేర్చుకొంటున్నారు. అందరి మొహాలకు అడ్డంగా జేబురుమాళ్ళున్నాయి. నెత్తిన గాంధీ టోపీలున్నాయి. సర్జన్ హీరోకేసి కుడిచెయ్యి చాస్తాడు. హీరో గబుక్కున వొక పట్కారు సర్జన్ చేతిలో పెడతాడు. ఆ తరవాత సర్జన్ ఎడమ చెయ్యిస్తాడు. హీరోయిన్ వొక స్పానర్ అందిస్తుంది. సర్జన్ వూపిరి సలపకుండా రెండుచేతులతోనూ కటింగ్ ప్లైయర్, రెంచీలు, ఆకురాళ్ళు, చిన్న సుత్తెలు, పిన్సర్లూ, పెన్సళ్ళు చెక్కే మరలు మొదలైనవి అందుకొంటూ చిట్టచివరకి మొహానవున్న చేతిరుమాలు తీసేసి దానితో నుదురు తుడుచుకుని చిన్న చిరునవ్వు నవ్వుతాడు.

హీరో కూడా చేతిరుమాలులాగేసి ఆపరేషన్ టేబిల్‌మీద చెయ్యి పిడికిలి బిగించి పైకెత్తి "జై డాక్టరుగారికి జై!" అంటాడు. నర్సులూ, అసిస్టెంటు సర్జన్లు ఒక్కసారి "జై!" అని పెడబొబ్బ పెడతారు. సర్జన్ ఎందుకో హీరోను భుజం తట్టి వీపు తిప్పి వెళ్ళిపోతాడు.

హీరో అటూ యిటూ చూస్తాడు. హీరోయిన్ లేదు. ఆమెను వెతుక్కుంటూ వార్డుల వెంట బయల్దేరతాడు. ఆమె ఒకచోట బల్లముందు కూచుని యేడుస్తున్నది. ఆమె పక్కనే వొక టెలిగ్రాం. హీరో దాన్ని యెత్తి చూసీ చూడకుండానే "డెడ్" అని చదువుతాడు.

హీరోయిన్ తల్లి చావు కారణంగా లిప్‌స్టిక్, మొహాన బొట్టూ, తలకు చమురూ మానేసి, మాసికలు వేసిన చీర (నైలాన్ జార్జెట్ వాయిల్ నేత చీర) కట్టుకొని దరిద్ర శోకదేవతలాగా వుంది.

"ఇంక నాకు భవిష్యత్ లేదు. నా చదువు మంటకలిసిపోయింది. నేను కన్న కలలు కరిగిపోయాయి. నాబ్ – రతుకు అనాథబ్–రతుకయి పోయింది" అంటూ ఏడుపు బాగా రావటానికి కిందిపెదవి గట్టిగా కొరుక్కుంటుంది.

"మనం పెళ్ళాడేసి సుఖంగా ఉండాలి" అంటాడు హీరో. "నీకేం మతిపోయిందా ఏవిటి? ఇంకా ఏడో రీలు పూర్తికాలేదు. విలన్ సీక్వెన్సులన్నీ ముందేవున్నాయి. పైగా మనం ప్రేమించుకున్నాం. మనకు పెళ్ళి ఎలా అవుతుంది?" అని హీరోయిన్ మందలిస్తుంది.

హీరో నిట్టూర్చి కనుబొమలూ, తలా ఎగరేసి "అవును? మన పెళ్ళికి ఫార్ములా వొప్పదు!" అంటాడు.

హీరోయిన్ పెళ్ళాడిందా, లేక అవివాహిత వితంతువుగా వుండిపోయి తన పాతివ్రత్యాన్ని కాపాడుకొందా? విలన్ ఏమయినట్లు? హీరో ఏమవుతాడు? అసలు ఇదే కథ? ఈ వివరాలన్నీ దయచేసి మరోలా అనుకోకుండా తెరపైన చూడండి.

*మొదటి ముద్రణ: 1954 ?*
*పునర్ముద్రణ : నవగ్రహ కూటం, 1966 ?*
*జనతా ప్రచురణాలయం, విజయవాడ*